ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 2 మార్చి 2025
**** ఇఫ్తార్ : 6.23 | సహర్ : 5.21 (సోమవారం)

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980


నల్లగొండ	18004251442
యాదాద్రి	1800 425 7106
సూర్యాపేట	1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 | కనిష్ఠం 20.0



● బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ఏకశిఖర వాసుడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేనా రాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, వేద మంత్రోచ్ఛారణ, చతుర్వేద, ప్రబంధ పారాయణాల నడుమ సంప్రో క్షణ, పుణ్యాహవాచనం, మృత్స్యంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు.

●6లో..



● చాంద్ ముబారక్

నెలవంక కనిపించడంతో జిల్లాలో రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించనుండటంతో ప్రత్యేక ప్రార్థనలకు మసీదుల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మసీదుల్లో సైరన్ మోగించి మాసం ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఈ మాసంలో ఇఫ్తార్ విందుల సందడి నెలకొననుంది. రంజాన్ మాసం ప్రత్యేక వంటకం హరీస్ కాగా, ఇది చికెన్‌తో రూపొందనుండటంతో బర్డ్‌ఫ్లూ భయంతో విక్రయాలపై ప్రభావపడే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. రంజాన్ మాసం ప్రారంభం అవడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ కల్చరల్

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈ నెల 5 నుంచి 25 తేదీ వరకు పరీక్షలు
- ఈసారి కూడా నిమిషం నిబంధన అమలు
- గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- ఉమ్మడి జిల్లాలో 113 పరీక్షా కేంద్రాలు, 58,222మంది విద్యార్థులు



నల్లగొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్‌ల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్స్‌ను నియమించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 113 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 58,222మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు తెలిపారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా తాగునీటి సౌకర్యాన్ని కల్పించనున్నారు. వేసవి దృష్ట్యా ఎవరైనా...

- మిగతా 7వ పేజీలో...

జిల్లా	పరీక్షా కేంద్రాలు	ఫస్టియర్ విద్యార్థులు	సెకండియర్ విద్యార్థులు	మొత్తం
నల్లగొండ	52	13,992	14,730	28,722
సూర్యాపేట	32	8,640	8,308	16,948
యాదాద్రి	29	6,252	6,300	12,552
మొత్తం	113	28,884	29,338	58,222



మండలి పోలింగ్ సరళిపై అభ్యర్థులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు సమీక్షల్లో బిజీబిజీగా ఉన్నారు. ఎవరికి వారు కూడికలు, తీసివేతల లెక్కల్లో మునిగితేలుతున్నారు. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో గెలుస్తామో లేదో అనే ఆందోళన అభ్యర్థుల్లో మొదలైంది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌లో ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు హోరాహోరీగా పోటీపడ్డారు. దీంతో ఈ ఎన్నిక ఫలితం ఎలా ఉండనుందోనని ఆసక్తి అంతటా ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లు ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపారోనని ప్రధాన సంఘాల నేతలు అంచనాల్లో మునిగారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మండలి.. ఎన్నికలో గట్టెక్కుతామా?

- ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారనే అంశంపై నేతల్లో అలజడి
- ఓటరు జాబితాలతో కసరత్తు చేస్తున్న సంఘాలు
- ఏ జిల్లాలో ఎవరికి అధిక ఓట్లు పడ్డాయని అంచనాలు
- ఈ నెల 3న రాత్రి తరువాతే ఉత్కంఠకు తెర

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలే ఎజెండాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు, వారిని బలపరుస్తున్న ఉపాధ్యాయ, బీసీ సంఘాల నేతలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తమను గెలిపిస్తే ప్రభుత్వం ద్వారా సరైన న్యాయం చేయిస్తామని హామీలు ఇచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపాలనే నినాదంతో పలు సంఘాలకు చెందిన నేతలు ఎన్నికల బరిలో నిలిచారు. చివరికి ఎన్నిక ప్రశాంతంగా ముగియగా, భారీగా పోలింగ్ శాతం నమోదైంది. ఈ నెల 3న మండలి ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. భారీగా పోలింగ్ నమోదు కావడంతో ఓటరునాడి తెలియక అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతల్లో ఫలితాలపై ఉత్కంఠ ఏర్పడింది. ఓటరు జాబితాలు తీసుకొని ఏ జిల్లాలో తమ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉందనే అవకాశాలపై ముఖ్యనేతలు మూడు రోజులుగా కూడికలు, తీసివేతల్లో బిజీగా ఉన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి నేతల నుంచి రాష్ట్ర కమిటీ నేతలు సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాల కార్యాలయాల్లో కీలక నేతలు సమావేశమై ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారని, ఈ ఎన్నికలో గట్టెక్కుతామా? అంటూ ఆరా తీస్తూ అంచనాలు తారుమారవుతాయా? అనే అలజడి ఆశలు పెంచుకున్న అభ్యర్థులు,నేతల్లో మొదలైంది. ఉపాధ్యాయ మండలి నియోజకవర్గంలో మొత్తం 12 జిల్లాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 8,331 మంది ఓటర్లు ఉండగా, నల్లగొండ జిల్లాలో 4,683 మంది, యాదాద్రి జిల్లాలో 984 మంది, సూర్యాపేట జిల్లాలో 2,684 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచి ఉన్నారు. గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నా, వాస్తవ పరిస్థితి ఏంటనే అంశంపై క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఏ అభ్యర్థికి అధికశాతం మద్దతు లభించిందనే....

- మిగతా 6వ పేజీలో...

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సవ్యంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ఏర్పాటు చేయనున్న టేబుళ్లు, చెల్లుబాటు అయ్యే ఓట్లు, కాని ఓట్ల గుర్తింపు, తదితర అంశాలను ఆమె వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడి సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని, ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకారం అందించాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాములో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు నియమించిన సిబ్బంది కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫాం-16ను సరిపోల్చుకోవడం, బ్యాలెట్ బాక్సుల సీలును అభ్యర్థులు, ఏజెంట్ల ఎదుట తీయడం, సంబంధిత ఫారాల్లో సంతకం చేయడం వంటి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెల్లని ఓట్ల విషయంలో సందేహాలు వస్తే ఏఆర్‌వో లేదా రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్ వద్ద నివృత్తి చేసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్య ఓటు విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జ్ డీఆర్వో అశోక్‌రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నల్లగొండ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గమని, పెట్టుబడిదారీ విధానానికి విసిగిన ప్రపంచం కమ్యూనిజం వైపు చూస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానంతో పలు సంక్షోభాలు ఏర్పడి సమానత్వం కోసం పోరాడే ప్రజలు కమ్యూనిజం వైపు చూస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో కమ్యూనిజానికి మంచి రోజులు వస్తాయన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అమెరికాలో నూతనంగా ఏర్పడిన ట్రంప్ ప్రభుత్వం మన వారిని గెంటివేస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ వారితో సాన్నిహిత్య సంబంధాలు ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. శ్రీలంకలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేసి కమ్యూనిస్టుల పాలనను కోరుకున్నారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తారని, వారి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో సర్వేలు నిర్వహించి ప్రజా సమస్యలపై కరపత్రాలు ముద్రించి పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళనలను నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బీకార్ మల్లేష్, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో 'పది'లం

●7లో..

చదువుతో ఏదైనా సాధించవచ్చు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఇంటి పనులు చేస్తూ టైలరింగ్ నేర్చుకోవడం అభినందనీయమన్నారు. మహిళలు బాగా చదువుకుంటే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, వయసుతో చదువుకు సంబంధం లేదన్నారు. 50ఏళ్ల తరువాత కూడా మహిళలు చదువుకొని పెద్ద కంపెనీలు ప్రారంభించి సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు చాలా మంది ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తాను సైతం తెలంగాణ ఉద్యమంపై అవగాహన కోసం చాలా పుస్తకాలు చదివానని తెలిపారు.అయితే ఈ కేంద్రంలో సరిపడా కుట్టు మిషన్లు లేవని మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, 30కుట్టు మిషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివి పేరు తీసుకురావాలి

విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని బాలికల రెసిడెన్షియల్ కళాశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినులు పరిజ్ఞానాన్ని సంపాదించేందుకు పుస్తకాలు, వార్తాపత్రికలు బాగా చదవాలని, ప్రత్యేకించి సంపాదకీయాలు, గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం కళాశాల వంటగదిని, డైనింగ్, పరిసరాలను పరిశీలించి వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. అపరిశుభ్రత కారణంగా ఏ ఒక్క విద్యార్థిని ఆస్పత్రిపాలు కాకుండా చూడాలని, బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ వాడవద్దని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కాగా హాస్టల్‌కు గ్యాస్ స్టవ్‌లు కావాలని ప్రిన్సిపాల్ కోరగా, అందుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ షాహీన్ షేక్, తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌పై కలెక్టర్ ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ శనివారం రాత్రి తనిఖీ చేసి ఆ సమయంలో అందుబాటులో లేని స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేజీబీవీలోని వంట గది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. భోజనం, మెనూ వివరాలను విద్యార్థినులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

(ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి): అధికారులు మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాన్ని, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ స్థలం ఉన్నందున ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయించినట్టు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబీవీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో స్వామి, ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



హాస్టల్‌లో భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు

మిర్యాలగూడ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ భవనాల్లో మెనూ తప్పకుండా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని కళాశాల బాలుర వసతి గృహంలో ఆయన శుక్రవారం రాత్రి బసచేసి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. శనివారం ఉదయం వసతి గృహ అధికారులతో మాట్లాడుతూ, విద్యార్థులకు అందుతున్న వసతులు, ఆహారాన్ని పరిశీలించానని, మెనూ తప్పకుండా పాటించాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు స్టడీ అవర్ కేటాయించాలని, విద్యతో పాటు జీవన పాఠాలు నేర్పించాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూవో వెంకటకృష్ణ, వార్డెన్ అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్

నల్లగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార, మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జీగా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. డీసీఎంఎస్‌ల పాలకవర్గ కాల పరిమితి గత నెల 25న ముగిసింది. దీంతో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జీగా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర సహకార, రిజిస్ట్రేషన్ కోఆపరేటివ్ సొసైటీల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు తీసుకోగా, జిల్లా సహకారశాఖ అధికారి పత్యా నాయక్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.




సమావేశంలో పాల్గొన్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

నేటికీ అందని రాజ్యాంగ హక్కులు

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

నల్లగొండ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నేటికీ రాజ్యాంగ హక్కులు దళితులకు చేరడం లేదని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మగ్దుమ్ భవన్‌లో నిర్వహించిన డీహెచ్‌పీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రతీ మనిషికి ఓటు హక్కు కల్పించడం మహత్తరమైనదని, న్యాయకల్పనలో ప్రభుత్వాల కృషి లోపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన బడ్జెట్‌లో కేవలం 5 శాతం మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళితులు చేస్తున్న పోరాటంలో డీహెచ్‌పీఎస్ భాగస్వామం కావాలన్నారు. అట్టడుగు వర్గాలకు ద్రోహం చేసే విధంగా బీజేపీ విధానాలు ఉన్నాయని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు నేటితరం సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లగొని నరసింహ, వెంకటయ్య, సత్యం, వెంకన్న, గోస్కుకొండ లింగయ్య పాల్గొన్నారు.

శ్రీకరం శుభకరం



యాదగిరిగుట్ట ప్రధాన ఆలయంలో విష్వక్సేనారాధన నిర్వహిస్తున్న అర్చకులు, చిత్రంలో ఈవో భాస్కర్‌రావు

● లక్ష్మీనృసింహుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

భక్తజన బాంధవుడు.. ఆపద మొక్కుల వాడు.. ఏకశిఖర వాసుడిగా నిత్యపూజలు అందుకునే స్వయంభు యాదగిరి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు శనివారం విష్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. అర్చకుల వేద మంత్రోచ్ఛరణలు.. వేద పండితుల చతుర్వేద పారాయణం.. రుత్వికుల ప్రబంధ పారాయణాల నడుమ సంప్రోక్షణ, పుణ్యాహవాచనం చేపట్టగా సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణ వైభవంగా కొనసాగాయి. నృసింహక్షేత్రం ఆధ్యాత్మిక సందడితో ప్రత్యేక శోభ సంతరించుకుంది.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)

లక్ష్మీనరసింహుల తిరుకల్యాణోత్సవం ఆరంభానికి ముందు ఆలయ పరిసరాలు శాస్త్రోక్తంగా శుద్ధి చేసేందుకు పుణ్యాహవాచన పూజలు నిర్వహించారు. మండపంలో విశేష అలంకారంతో దివ్య మనోహర లక్ష్మీనరసింహుల ఉత్సవమూర్తుల ఎదుట పంచామృత కలశాలకు, దర్భ(గరక) లతో వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. పూర్ణకుంభ కలశ జలాలను మంగళవాయిద్యాలతో ఆలయ మండపానికి తెచ్చి ప్రత్యేకపూజలతో పుణ్యజలాలుగా సంప్రాప్తి కల్పించారు. ప్రధానాలయ కొండగుహలో స్వయంభు మూర్తులకు నిజాభిషేకం చేశారు. అనంతరం ఆలయ మండపం, పరిసరాలను, కొండపై నలుదిక్కుల మంత్రించిన పవిత్రజలాన్ని చిలకరిస్తూ పుణ్యాహవాచనం కార్యక్రమాలను నాదస్వర, మృదంగ మంగళవాయిద్యాలతో నిర్వహించారు.

ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు

స్వయంభు లక్ష్మీనరసింహులు కొలువైన ప్రధాన గర్భాలయంలో బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవ దీక్ష సంకల్పానికి కంకణాలకు గర్భాలయంలో పూజలు నిర్వహించి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఉత్సవాలు నిర్వహించేందుకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవ నిర్వహణలో కీలకమైన కంకణాలను స్వయంభువుల ఎదుట పెట్టి పూజించి శాస్త్రోక్తంగా కంకణధారణ చేశారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు అర్చక బృందం నిర్వహించగా ఈవో ఏ.భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వెల్లి రఘు, పర్యవేక్షకులు ధీరావత్ రామారావునాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్సవ సంకల్ప పూజలు.. కంకణధారణలు

బ్రహ్మోత్సవాల్లో వివిధ సేవల్లో ఊరేగించే ఉత్సవమూర్తులతో పాటు మూలవరులకు రక్షాబంధన వేడుక వైభవంగా నిర్వహించారు. ఆగమ శాస్త్ర ప్రకారం మంత్ర పఠనాలతో ఆరాధన చేసి స్వామివారికి అర్చకులు కంకణధారణ చేశారు. అనంతరం నిర్వాహకులను దీక్షాబద్ధులను చేస్తూ అర్చకులు అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, కార్యనిర్వహణాధికారి భాస్కర్‌రావుతో పాటు అధికారులకు కంకణధారణ చేశారు.



నృసింహ స్వామికి మొక్కుతున్న మహిళ

చతుర్వేద.. ప్రబంధ పారాయణాలు

బ్రహ్మోత్సవ ప్రారంభ ప్రాధాన్యతతో చతుర్వేద మంత్రపారాయణాలు, ఉపనిషత్తులు, పంచసూక్తాలు, శ్రీసుదర్శన శతక, రామాయణ, భాగవతాలను క్షేత్ర మహత్యం, మూలమంత్ర జపాలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు, రుత్వికులకు అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నర్సింహమూర్తి, ఆలయ ఈవో భాస్కర్‌రావు స్వామి వారి దీక్షావస్త్రాలను బహూకరించారు.

మృత్సంగ్రహణం.. అంకురారోపణం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం జరిపిన అర్చకులు శనివారం సాయంత్రం కార్యక్రమాల్లో మృత్సంగ్రహణం, అంకురారోపణం సంప్రదాయరీతిలో నిర్వహించారు. పుట్టమన్నులో నవధాన్యాలను నిర్దేశించిన వేద మంత్రాలతో పవిత్రీకరించి తడిపి పాలికల్లో మొలకెత్తించే కార్యక్రమమే అంకురారోపణం. భూమిపై గల క్షేత్రాలు, పచ్చని పంటలతో సస్యశ్యామలంగా చేసేందుకు భగవంతుడి అనుగ్రహింపునకు ఈ అంకురారోపణ కార్యక్రమం నిర్వహించే ఉద్దేశ్యమని ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నీలిమ ఆసుపత్రి (ఘట్‌కేసర్) కొండపైన సుమారు 100 మందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం నుంచి ఈ నెల 11 వరకు నిత్యం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు ధ్వజారోహణం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు ఆదివారం ఉదయంవేళ అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రివేళ భేరిపూజ, దేవతాహ్వానం, హవన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనాలు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సహస్రావధాని, పద్మశ్రీ, డాక్టర్ గరికపాటి నరసింహారావు శనివారం ఆలయ ఉత్తర తిరువీధిలో ప్రవచనాలు చేశారు. ప్రవచనాల్లో కలెక్టర్ ఎం.హనుమంతరావు, పాల్గొనగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎర్రాప్రగడ రచించిన నృసింహ వైభవం గరికపాటి ప్రవచించారు.

తొలిపూజలు

సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనుడికి తొలిపూజలతో స్వామి వారి బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఉత్సవ మండపంలో పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించిన స్వామివారిని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగేందుకు నిర్దేశించిన మంత్రోచ్ఛరణలతో తొలిపూజలు చేశారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు దంపతులు



ఈవో భాస్కర్‌రావుకు కంకణధారణ చేస్తున్న అర్చకుడు


బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి పట్టువస్త్రాలు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లకు పోచంపల్లి ఇక్కత్ చేనేత పట్టు వస్త్రాలను శనివారం ఆలయ అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని చేరుకున్న చేనేత, పద్మశాలి సంఘం నాయకులు ఆలయ అధికారులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సీత శ్రీరాములుశ్రేష్ఠి, బోగ నర్సింహ, అంకం మురళీ, భారత బాలరత్నం, సీత సత్యనారాయణ, భారత ఆంజనేయులు, అంకం యాదగిరి, వనం క్రిష్ణ, ఇంజమూరి యాదగిరి, మెరుగు యతినందం, నక్క రామచంద్రం, గుర్రం క్రిష్ణ, ఆటిపాముల నాగేష్, తడక రమేష్, భారత లవకుమార్, చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, రాపోలు శ్రీనివాస్, పాండు పాల్గొన్నారు.



అర్చకులకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న పద్మశాలి నాయకులు

దివ్య విమాన గోపురం




యాదగిరిగుట్ట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పాత.. కొత్త దివ్య విమాన రాజగోపురాలు భక్తులకు నిత్యం కనువిందు చేస్తూనే ఉన్నాయి. స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం తర్వాత ఇప్పుడు స్వర్ణ గోపురం ఆవిష్కృతమై కృష్ణశిల రాతి ఆలయంపై బంగార రాజగోపురం ఆలయానికే కొత్త అందంతో కనువిందు చేస్తోంది. ఆలయ పునర్నిర్మాణం కంటే ముందు రాగితో తయారు చేసిన సుదర్శన చక్రం ఉండేది. అప్పుడు రాగి సుదర్శన చక్రం, ఇప్పుడు బంగారు సుదర్శన చక్రం ఎప్పటికీ భక్తులను కనువిందు చేస్తూనే ఉన్నాయి.



గతంలో రెండు పుష్కరిణిలు

యాదగిరిగుట్ట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిమాన్విత స్వయంభు యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా రెండు పుష్కరిణిలు ఉండేవి. కొండపై వెలసిన సహజ సిద్ధమైన విష్ణుపుష్కరిణీకి పురాణపరంగా.. క్షేత్ర మహత్యంలో అత్యంత ప్రాధాన్యం ఉంది. కాలక్రమేణ అవి కనుమరగయ్యాయి. ప్రస్తుతం ఆలయ అభివృద్ధిలో భాగంగా కొండపైన స్వామివారి వివిధ ఉత్సవాల్లో స్నానం ఆచరించేందుకు విష్ణుపుష్కరిణి, భక్తుల కోసం కొండకింద లక్ష్మీ పుష్కరిణిలు వేర్వేరుగా ఉండేవి. కొండపైన విష్ణుపుష్కరిణిలో నామమాత్రం రుసుంతో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఆలయ అధికారులు అనుమతిస్తున్నారు. కాగా, పూర్వకాలంలో ఒకే దానిగా కనిపిస్తున్న సహజ జలధారతో ఏర్పడిన పుష్కరిణి పూర్వం రెండు గుండాలుగా ఉండేవి.





వీటిలో భక్తి విశ్వాసాలతో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా క్షేత్రపాలకుడు, ఆ తర్వాత స్వామివారిని భక్తులు దర్శించుకునే వారు. కాలక్రమేణ ఆలయ అభివృద్ధి అవసరాల కోసం మహిళలు స్నానమాచరించే పుష్కరిణిని పూడ్చివేసి విష్ణు పుష్కరిణిని ఏర్పాటు చేశారు. భక్తులు కూడా పెరగడంతో పుష్కరిణికి వచ్చే సహజ జలధార సరిపోకపోవడంతో కొండ దిగువ పాత గోశాల నుంచి నీటిని మోటర్ల ద్వారా తరలించేవారు. కాగా, భక్తుల తాకిడి నానాటికి రెట్టింపు కాగా పుష్కరిణిలో జలాలు కూడా కలుషితమవుతుండగా నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు చేశారు. పూర్వకాలంలో ఇక్కడి పుష్కరిణిలో మునులు, రుషులే కాదు.. దేవతలు సైతం ఇక్కడి పుష్కరిణిలో స్నానాలు ఆచరించి పంచనారసింహుడిని దర్శించుకుని పూజలు జరిపేవారని క్షేత్ర పురాణం ద్వారా తెలుస్తోంది. దేవతలు స్వామివారి పాదాలు కడిగిన జలధారలే ఇక్కడి విష్ణుపుష్కరిణి ప్రసిద్ధి చెందిందని భక్తుల నమ్మకం. ఇక్కడి పుష్కరిణిలో మండలం (40) రోజులు స్నానమాచరించి కఠోరంగా స్వామివారి గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తే గ్రహ, గృహ బాధలు తొలగి దీర్ఘ రోగాలు, మానసిక వ్యాధులు నయమైతాయని భక్తుల నమ్మకం.

మండలి ఎన్నికలో .. గట్టెక్కుతామా?

(5వపేజీ తరువాయి)

అంశంపై ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు ఎవరి పట్టం కడతారు? ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారు? ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తాయా? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈఉత్కంఠకు 3న వెలువడే ఫలితం వరకు కొనసాగనుంది.

ఏ జిల్లాలో ఎవరికి అధికమో?

ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఓటర్ల నాడి గుంభనంగా ఉండటంతో ఫలానా పార్టీ అభ్యర్థి గెలుస్తారనే స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. అభ్యర్థుల గెలుపోటములను తేల్చిచెప్పే సమయం దగ్గరపడుతుండటంతో వారిలో టెన్షన్ మొదలైంది. సోమవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసి అదేరోజు ఫలితాలు ప్రకటించనుండటంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గెలుస్తామా? ఓడిపోతామా? అనేది స్పష్టత లేకపోవడంతో అందరికీ ఫలితాల జ్వరం పట్టుకుంది. విజేత ఎవరనేది సోమవారం రాత్రి వరకు కొలిక్కివచ్చే అవకాశం ఉంది. మండలి ఎన్నికలను ఉపాధ్యాయ సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి నాయకత్వమంతా ఆయా మండలాల్లో ఉండి, అభ్యర్థి విజయం కోసం పనిచేసింది. బీజేపీ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికలో విజయంతో మరోసారి ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థి, ఈసారి ఎలాగైనా గెలుపొందాలని టీపీఆర్టీయూ, పీఆర్టీయూ, బీజేపీ, బీసీ సంఘాల నేతల నుంచి అభ్యర్థులు బరిలో దిగారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు అన్ని జిల్లాల్లోనూ హోరాహోరీగా పోటీపడ్డారు. అయితే మండలి నియోజకవర్గం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాలు, ఉమ్మడి ఖమ్మంలోని రెండు జిల్లాలు, ఉమ్మడి నల్లగొండలోని మూడు జిల్లాలో విస్తరించి ఉంది. జిల్లాల పునర్విభజన కావడంతో ఒక్కో జిల్లాలో ఒక్కో సంఘం ప్రధాన భూమికి పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏ జిల్లాల్లో ఎవరికి అధిక ఓట్లు లభించాయి అనే అంశంపై ఉపాధ్యాయ సంఘాలు, పార్టీ నేతలు సమీక్షల్లో నిమగ్నమయ్యారు. ఈ సారి జరిగిన ఎన్నికల్లో తమదే గెలుపే అనే ధీమాతో పలు సంఘాలు ఉన్నాయి. అంతా ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, ఏ పార్టీ అభ్యర్థికి ఉపాధ్యాయులు మద్దతు ప్రకటించారన్నది నిశ్శబ్దంగా మారింది. ఉపాధ్యాయ సంఘాల నేతలు మాత్రం మండలాల వారీగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయనే దానిపై కసరత్తు ప్రారంభించారు. పోటీ హోరాహోరీగా జరగడంతో గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

ఆటో బోల్తా.. మహిళ మృతి

● 10 మంది కూలీలకు గాయాలు

● పరిమితికి మించి ప్రయాణికులతో ప్రమాదం

నిడమనూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తాపడటంతో ఓ మహిళా కూలీ మృతి చెందగా, ఆటో డ్రైవర్ సహా 10 మంది కూలీలు గాయపడ్డారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడ్ స్టేజీ సమీపంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం త్రిపురారం మండలం కోమటిగూడెం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు పెద్దవూర మండలం తుంగతుర్తిలో మిరపకాయలు తెంపేందుకు శనివారం ఉదయం ఆటోలో వెళ్తున్నారు. నిడమనూరు మండలం వేంపాడ్ స్టేజీ సమీపంలోకి రాగా లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పిన ఆటో ఒక్కసారిగా లోతట్టు ప్రదేశంలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మేకల రాములమ్మ(50), అనుముల సుజాత, నక్కా లక్ష్మమ్మ, నక్కా సైదమ్మ, జొన్నలగడ్డ మౌనిక, గజ్జి కళమ్మ, గజ్జి జ్యోతి, నక్కా శ్రీలత, గజ్జి హేమలత, అనుముల కృష్ణయ్యతోపాటు ఆటో డ్రైవర్ మేకల నాగరాజు గాయపడ్డారు. ఇందులో మేకల రాములమ్మ తీవ్రంగా గాయపడింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంపటి ప్రతాప్, ప్రకాశ్ వాహనంలో క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంలో గాయపడిన కూలీలను అంబులెన్స్ వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా తీవ్రంగా గాయపడిన రాములమ్మను మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అతివేగంగా ఆటో నడపడంవల్ల ప్రమాదం జరిగినట్లు ఆటోలో ఉన్న మహిళలు తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులతో అతివేగంగా ఆటోలు నడపడంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు భావిస్తున్నారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు.



మేకల రాములమ్మ(ఫైల్)

చింతచెట్టుపై నుంచి పడి..

మోత్కూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో చింతపండు రాల్చడానికి చెట్టు ఎక్కిన ఏర్పుల వెంకటేష్ (55) ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ డి.నాగరాజు, గ్రామస్థుల వివరాల ప్రకారం... మోటకొండూరు మండలం వర్టూరు గ్రామపంచాయతీ పరిధిలోని శాకంపెల్లి గ్రామానికి చెందిన ఏర్పుల వెంకటేష్ మూడు రోజులక్రితం (గత నెల 27న) తన కుమార్తె-అల్లుడు మమత, మొల్కల మహేష్ ఇంటికి వచ్చాడు. తన వియ్యంకుడు (అల్లుని తండ్రి) ఇటీవల చనిపోవడంతో రెండు రోజులుగా అల్లునికి తోడుగా నిలిచి వ్యవసాయ పనుల్లో సహకారమందించాడు. శనివారం మధ్యాహ్నం వారి ఇంటి ఎదుట ఉన్న చింతచెట్టుకు చింతపండు దులుపడానికి చెట్టు ఎక్కాడు. చింతపండు రాల్చుతుండగా పట్టుతప్పి జారి కిందపడి, తలకు తీవ్రగాయమై ఎక్కువ రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్తె కుటుంబానికి సహకరిద్దామని వచ్చి ప్రమాద వశాత్తు మృతి చెందడంతో ఆ రెండు కుటుంబాలు, వారి బంధువులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు. వెంకటేష్‌కు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



ఏర్పుల వెంకటేష్(ఫైల్)

లైంగిక దాడి కేసులో జైలుశిక్ష

మర్రిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 16 నెలల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. 2017లో శివన్నగూడ గ్రామానికి చెందిన చింతకుంట్ల నర్సిరెడ్డి అదే గ్రామానికి చెందిన బాలికను లైగింక వేధింపులకు గురిచేయగా బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడిని నల్లగొండ కోర్టుకు పంపగా నల్లగొండ జడ్జి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్‌రావు వాదనలు ముగించిన అనంతరం చింతకుంట్ల నర్సిరెడ్డికి జడ్జి 16నెలల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సూర్యాపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తూ, ఇతరులకు విక్రయిస్తున్న ముగ్గురిని సూర్యాపేట రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్‌చేసి నిందితులను వివరాలు వెల్లడించారు. రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలునాయక్, సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి చెందిన మెంతబోయిన గణేష్, గోర్ల శివారెడ్డి, పబ్బు విజయ్, మామిడి గోపిలు కలిసి సూర్యాపేట మండలం కేసారం గ్రామశివారులో శ్మశానవాటిక వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని మందలించారు. దీంతో వారు పారిపోవడానికి ప్రయత్నించగా వారిలో ఒకరు తప్పించుకోగా ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. వారిని విచరించగా ఒడిశా రాష్ట్రం అంపదర్ గ్రామానికి చెందిన ఆనంద్ దగ్గర గంజాయిని కిలోకు రూ.2000 చొప్పున కొనుగోలుచేసి సూర్యాపేట పట్టణ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటామని, వారు కూడా పీల్చుతామని నేరాన్ని ఒప్పుకున్నారు. వారి నుంచి రెండుకిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. సమావేశంలో ఎస్ఐలు బాలునాయక్, గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టకు చేరిన అఖండజ్యోతి



భువనగిరిలో యాత్రకు స్వాగతం పలుకుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, యాదగిరిగుట్ట రూరల్, యాదగిరిగుట్ట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు నాలుగు రోజులపాటు సాగే అఖండజ్యోతి యాత్ర లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల వైభవానికి ప్రతీక అని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి భువనగిరిలో యాత్రను ప్రారంభించి మాట్లాడారు. 31 సంవత్సరాలుగా జ్యోతి యాత్ర నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. యాత్ర చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, భువనగిరి అధ్యక్షుడు ఫకీర్ కొండల్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, పోత్నక్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో ఘనస్వాగతం

లక్ష్మీనరసింహస్వామివారి అఖండజ్యోతి యాదగిరిగుట్ట పట్టణానికి చేరింది.ఊరూర దారి పొడవున అఖండజ్యోతికి భక్తులు విశేషంగా హారతులు సమర్పించారు. నాలుగు రోజుల పాటు సాగిన యాత్ర శనివారం యాదగిరిగుట్టకు చేరుకుంది. కార్యక్రమంలో ఆలయ డీవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో గజ్వేల్ రమేష్, ఏసీపీ రమేష్‌కుమార్, రూరల్ సీఐ. కొండల్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ వాణీభరత్‌గౌడ్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటే విజయం సొంతమేనని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పదోతరగతి తొలిమెట్టు. ఇక్కడ నుంచే పిల్లలపై తల్లిదండ్రుల దృక్పథం ఆధారపడి ఉంటుంది. విద్యార్థులకు కూడా ఇక్కడ వచ్చే మార్కుల ఆధారంగానే భవిష్యత్తుపై ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. మారిన సీసీ విధానంతో బట్టీ పట్టే పద్ధతికి అవకాశం లేదు. పదోతరగతిలో గట్టెక్కాలంటే పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవడమే ఉత్తమ మార్గమని విద్యానిపుణులు సూచిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఏయే అంశాలకు ప్రాధాన్యమివ్వాలి. ప్రణాళికను ఎలా సిద్ధం చేసుకోవాలో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. అంతేగాకుండా పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. తరగతుల్లో ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి, మఠంపల్లి)

ప్రణాళికతో.. పదిలం



మెరుగైన ఫలితాలకు సమగ్ర సాధనే కీలకం..

పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలంటున్న ఉపాధ్యాయులు

ప్రతి అంశంపై సాధన చేయాలి



రసాయన సమీకరణాలు, పరమాణు నిర్మాణం, మూలకాల వర్గీకరణ, రసాయన బంధం అంశాలపై నాలుగు మార్కులు ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి. కాంతికి సంబంధించిన చిత్రాలపై సాధన చేయాలి. విద్యుత్, కార్బన్, రసాయన శాస్త్రం పాఠ్యాంశంలో రెండు మార్కుల ప్రశ్నలు వస్తుంటాయి. ఫార్ములాలు, అందులోని పదాలను క్షుణ్ణంగా తెలుసుకోవడం వల్ల బిట్లు ఎక్కువగా పూరించవచ్చు. ప్రయోగాలపై ముడిపెట్టి ప్రశ్నలు ఉంటాయి. ప్రతి పాఠం వెనుక నేర్చుకున్న విషయంపై బిట్లు ఉంటాయి. వాటిపై సాధన చేయాలి.

- ఎం.నాగలక్ష్మి, భౌతిక శాస్త్రం టీచర్

సారాంశాన్ని సొంత మాటల్లో వ్యక్తం చేయాలి



మాతృభాష తెలుగుపై ప్రత్యేక దృష్టి సారించాలి. పాదాల్లో నక్షత్ర గుర్తులున్న, పద్యాలు, ముఖ్యమైన కవులకు సంబంధించిన పద్యాలు బాగా చదివి ప్రతిపదార్థం రాసే విధంగా సాధన చేయాలి. పద్య, గద్య భాగాల్లో నేపథ్యం, ప్రక్రియలు బాగా నేర్చుకోవాలి. పాఠం సారాంశాన్ని సొంత మాటల్లో వ్యక్తం చేయగల సామర్థ్యం పెంచుకోవాలి. వ్యాకరణం, వ్యాసరూప ప్రశ్నలు జాగ్రత్త గా చదువుకోవాలి. అపరిచిన పద్యం కచ్చితంగా ఒకటి ఉంటుంది. దానికి సం బంధించిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. రెండో పేపర్లులో రామాయణంపై ఎక్కువ ప్రశ్నలు ఉంటాయి. అందులోని పాత్రల స్వభావంపై స్పష్టమైన అవగాహన పెంచుకోవాలి. అర్థాలు, ప్రకృతి, వికృతి, పర్యాయపదాలు, పదాలను విడదీయడం వంటివి సాధన చేయాలి. సమకాలీన అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలి.

-ఎస్. భవాని, తెలుగు పండిట్ జడ్పీహెచ్ఎస్, పెదవీడు



ఆంగ్లంపై భయాన్ని తొలగించుకోవాలి

ఇంగ్లిష్ సబ్జెక్టుపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని ం నుంచి తొలగించుకోవాలి. ప్రతి పాఠ్యాంశా న్ని క్షుష్ణంగా చదువుకుంటే చాలు సులువుగా మార్కులు సా ధించవచ్చు. కాంప్రహెన్షన్‌కు సంబంధించిన 30 మార్కులు ఉంటాయి. పాఠ్యాంశాలపై అవగాహన ఉంటే వీటిని సులభంగా రాయవచ్చు. క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్‌కు 20 మార్కులు కేటాయించారు. లెటర్ రైటింగ్, సంభాషణలు, జీవిత చరిత్రలపై అవగాహనపై ప్రశ్నలు ఉంటాయి. మూడో భాగంలో వ్యాకరణం ఉంటుంది. పాఠ్యపుస్తకం చివరలో ఉన్న ఎక్సైజ్ ఆధారంగా ఎక్కువ ప్రశ్నలుంటాయి. అవిసాధన చేస్తేచాలు 15 మార్కులు మనచేతిలో ఉన్నట్లే. అర్థం చేసుకొని చదివితే పరీక్షల్లో 100శాతం మార్కులు సాధించేందుకు వీలుంటాయి.



- రాజా, ఇంగ్లిష్ టీచర్

చార్టు, బార్‌గ్రాఫ్‌లపై దృష్టిసారించాలి



సాంఘిక శాస్త్రంలో రెండు పేపర్ల పరీక్షలు ఉంటాయి. మొదటి పేపర్లలో 12 పాఠాలు, రెండో పేపరులో 11పాఠాలు ఉంటాయి. మొదటి పరీక్షలో భారతదేశం భౌగోళిక స్వరూపాలు, ఉత్పత్తి, నీటి వనరులు, ఉపాధి, నదులు, గ్రామ అర్థిక వ్యవస్థ, ప్రపంచీకరణ, ఆహార భద్రత పాఠాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తుంటాయి.పై చార్టు, బార్ గ్రాఫ్‌లపై దృష్టిసారించాలి. చిత్రపటాలకు మార్కులు ఉంటాయి. నదులు, పర్వతా శిఖరాలు, ప్రాజెక్టులు, పీఠభూములు, హద్దులు గుర్తించాలి. పాఠ్యపుస్తకంలో ప్రతి పాఠంలో ముఖ్యమైన అంశాన్ని అండర్ లైన్ చేసుకోవాలి. రెండో పేపరులో 13,15,17,18,20 పాఠాలల్లో ప్రశ్నాలు ఎక్కువగా పరీక్షల్లో వస్తుంటాయి. మ్యాప్‌లో మహాసముద్రాలు, సముద్రాలు, జలసంధులు, పర్వతాలు, ముఖ్య దేశాలు, ప్రపంచ యుద్ధాల్లో పాల్గొన్న దేశాలు అంశాలపై దృష్టిసారించాలి. ప్రశ్నలు పరోక్షంగా ఉంటాయి. పాఠాలు సాధన చేయడం వల్ల ఎక్కువగా మార్కులు సాధించవచ్చు.

- బి.గురుప్రసాద్ సాంఘిక శాస్త్రం, టీచర్

అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి



జీవశాస్త్రంపై అవగాహన పెంచుకోవడంతో మంచి మార్కులు సాధించవచ్చు. మొదటి అంశం పోషణలో కిరణ జన్య సంయోగ క్రియ, శ్వాసక్రియల్లో ఎక్కువగా నాలుగు మార్కుల ప్రశ్నలు వస్తుంటాయి. పోషకాహార లోపంతో వచ్చే వ్యాధులు, విటమిన్లపై నాలుగు మార్కులు ప్రశ్నలు ఉంటాయి. మూడు ప్రయోగాల నుంచి నాలుగు ప్రశ్నలు, లేక రెండు మార్కుల ప్రశ్నలు తప్పకుండా వస్తాయి. మైటోకాండ్రియా విత్తనాలు, ఎలా శ్వాసక్రియ జరుపుతాయన్న ప్రతి అంశాలు కూడా కీలకమే. ప్రసరణ పాఠ్యాంశం నుంచి బ్లడ్ గ్రూప్‌లపై దృష్టిసారించాలి. విసర్జన పాఠం నుంచి నెఫ్రాన్ నిర్మాణం, మూత్రపిండం, డయాలసిస్, మొక్కలో ఆల్కలాయిడ్స్, అంశాలు చదవాలి. సమన్వయం పాఠంలో నాడీకణం, మెదడు అంశాలు కీలకమైనవి. మొక్కల్లో హార్మోన్లపై అవగాహన పెంచుకోవాలి. ప్రత్యుత్పత్తి పాఠంలో శుక్రకణ నిర్మాణం, రుతుచక్రం, అండం అడ్డుకోత అంశాలు కీలకమైనవి. శస్త్రచికిత్స మీద ప్రశ్నలుంటాయి. జీవక్రియలో సమన్వయం, జీర్ణమండలాన్ని మనశరీరంలో రెండో మెదడుగా ఎందుకు పరిగణిస్తారు వంటి అంశాలు చదవాలి. మెండల్ ప్రయోగాలు, పర్యావరణ వనరులు, పిరమిడ్ నంబర్లు ముఖ్యమైనవి. వ్యవసాయ పద్ధతులపై కూడా ప్రశ్నలు వస్తాయి.

-వి.లక్ష్మీదేవి, జీవశాస్త్రం టీచర్

హిందీలో వ్యాసరచనకు ప్రాధాన్యం

హిందీలో లెటరు, వ్యాసరచనకు ప్రాధాన్యముంటుంది. వ్యాకరణంపై 20 మార్కుల బిట్లు ఉంటాయి. వచనాలు, లింగ గర్తింపు, జాతీయాలు, కాలాలు, ఉపసర్గ్, పరసర్గ్, అంశాలు బాగా సాధన చేయాలి. 80 మార్కుల్లో 18 మార్కులువస్తే ఇంటర్నల్ లో నాలుగు మార్కులు సాధిస్తే ఉత్తీర్ణత సాధించినట్లే. అయితే చేతిరాతలను అభివృద్ధి మంచి మార్కులు పొందవచ్చు.



- సయ్యద్ ఇస్మాయిల్, హిందీ పండిట్ పెదవీడు

పాఠ్యాంశం చివరి బిట్లపై సాధన చేయాలి



గణితంలో మొదటి పేపరులో ఏడు పాఠాలకుగాను నాలుగు పాఠాల్లో ఉన్న ప్రశ్నలు ఎక్కువగా వస్తుంటాయి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, నిరూపక జామితి పాఠాల నుంచి ఎక్కువగా ప్రశ్నలుంటాయి. రెండో పేపరులో కూడా 6పాఠాలకు నాలుగు పాఠాల్లోని ప్రశ్నలు ఎక్కువగా వస్తుంటాయి. సంఖ్యాశాస్త్రం, త్రికోణమితి, అనువర్తనాలు, శాస్త్రసమితి, స్వరూప త్రిభూజలలో నిర్మాణాలు, సమితులు, సమ్మేళనం, భేదనం, కరణీయ సంఖ్యలు, గ్రాఫ్‌లపై మార్కులుంటాయి. సగటు బహుళకం, మధ్యగతం, శంఖువు, స్థూపం, గోళమునకు సంబంధించిన సమస్యలు నిర్మాణాలపై మార్కులుంటాయి. పరీక్షల్లో నేరుగా ప్రశ్నలు ఇవ్వకుండా మార్చి మార్చి ఇస్తుంటారు. లెక్కలు సాధన చేయడం మూలన సోపానక్రమాన్ని అవగాహన చేసుకోవాలి. తరువాత పాఠ్యాంశం చివరనా ఉన్న బిట్లను సాధన చేస్తే మంచి ఫలితం పొందవచ్చు.

- ఎం. ఇందిరా గణితం టిచర్ జడ్పీహెచ్ఎస్ పెదవీడు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	529.20
టీఎంసీలు	167.5892
ఎడమకాల్వకు నీటి విడుదల	8,986
కుడికాల్వకు	6,006
విద్యుత్ కేంద్రం ద్వారా	12,1013
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1500 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	280 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	28,874 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	34.54 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	2000 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 టీఎంసీలు
ప్రస్తుత నీటి మట్టం	634.48 అడుగులు
టీఎంసీలు	2.04 టీఎంసీలు
కాల్వలకు	629.27 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	49.53
అవుట్‌ఫ్లో	667.34 క్యూసెక్కులు

జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌కు

సాగర్ విద్యార్థిని ఎంపిక



సారిక

నాగార్జునసాగర్, మార్చి1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు నాగార్జునసాగర్ పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. సికింద్రాబాద్‌లో ఫిబ్రవరి 28వ తేదీ న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్.సారిక పాల్గొని ప్రతిభ చాటింది. బంగారు పతకాన్ని సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. సారిక సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. జాతీయస్థాయికి ఎంపికైన సారికను పైలాన్‌కాలనీలో కృష్ణ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సారికను కళాశా ల అధ్యాపకులు, తల్లిదండ్రులు స్నేహితులు అభినందించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అస్వస్థతకు గురైతే ప్రథమ చికిత్స అందించేందుకు వైద్య బృందాన్ని నియమించనున్నారు. పరీక్ష కేంద్రాలకు చేరేలా ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇదిలా ఉంటే ఇంటర్ ప్రశ్నపత్రాలు ఇప్పటికే ఉమ్మడి జిల్లా కు చేరాయి. వీటిని పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. కాన్ఫిడెన్షియల్ మెటీరియల్, ప్రశ్నపత్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ప్రత్యేకంగా గార్డ్‌లను ఏర్పాటు చేసి బందోబస్తు కల్పించారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశాం. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదు. ఎండలు తీవ్రం అవుతున్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నాం. -దస్రునాయక్, డీఐఈవో, నల్లగొండ

రసవత్తరంగా ఎద్దుల పందేలు

మేళ్లచెర్వు, మార్చి 1(ఆంధ్రజ్యోతి) :మహాశివరాత్రి ఉత్సవాల్లోభాగంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు రసవత్తరంగా కొనసాగాయి. పోటీల్లో గిత్తలు ఒక జతను మించి మరో జత పోటీలో పాల్గొనేందుకు కాలు దువ్వు తున్నాయి. పోటీల్లో శనివారం జూనియర్ విభాగంలో మొత్తం పది జతలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి జతకు నిర్వాహకులు బహు మతులు అందజేశారు. ప్రథమ బహుమతి విజేతగా నిర్ణీత 20 నిమిషాల సమయంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రోహన్‌బాబుకు చెందిన ఎద్దుల జత సుమారు 22 క్వింటాళ్ల బరువు 3,054.9 అడుగుల దూరాన్ని లాగి బుల్లెట్ బండిని గెలుచుకున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు జరిగిన సబ్ జూనియర్ విభాగంలో మొత్తం 14 జతలు పాల్గొనగా ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా మద్దిరాల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి గిత్తలు నిర్ణీత 20 నిమిషాల సమయంలో 3,141.8 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతిగా రూ. లక్ష నగదును బహుమతిగా గెల్చుకున్నాయి.



ప్రథమ బహుమతి పొందిన ఒంగోలు గిత్తలు

నేడు సీనియర్‌విభాగంలో పోటీలు

ఉత్సవాల్లో ముఖ్యమైన సీనియర్‌విభాగానికి నేడు(ఆదివారం) పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ విభాగంలో పాల్గొనేందుకు ప్రస్తుతంనికి 12 .జతల యజమానులు పేర్లు నమోదు చేసుకున్నారు.ఈపోటీలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనున్నారు.

జాతీయ స్థాయి ఆవిష్కరణలు

అభినందనీయం

జై టెక్ ఇండియా సంస్థ అధినేత డాక్టర్ కస్తూరి శివప్రసాద్




సమావేశంలో మాట్లాడుతున్న జై టెక్ ఇండియా సంస్థ అధినేత డాక్టర్ శివప్రసాద్

తుర్కపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌ను తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి ఢిల్లీ యూత్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించడం అభినందనీయమని జై టెక్ ఇండియా సంస్థ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత డాక్టర్ కస్తూరి శివప్రసాద్ అన్నారు. జనవరి 10 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలకు తుర్కపల్లి మండలం రామపురం జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్ ఎంపికైన సందర్భంగా విద్యార్థులు, గైడ్ టీచర్‌ను శనివారం సన్మానించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాన్నిచ్చే ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌ను తయారు చేసిన ఈ ప్రాజెక్టును ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తాము రూపొందించిన ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను వివరించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు లూనావతు అఖిల్, భానోతు తరుణ్‌ను శాలువాతో సన్మానించి ఒక్కో విద్యార్థికి రూ. 5వేల చొప్పున గైడ్ టీచర్ కోట నవీన్‌కుమార్‌కు రూ. 50వేలు ప్రోత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, జై టెక్ ఇండియా సంస్థ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పుల్లయ్య, కుర్మయ్య, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండుతున్న పైరు.. రైతు కన్నీరు

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ముదురుతున్న ఎండలకు ఎండుతున్న వరి పొలాలు
- ఇప్పటికే యాదాద్రి జిల్లాలో 10శాతం ఎండిన పొలాలు
- నోటికాడికి వచ్చిన పంట పశువులు, గొర్రెల పాలు





మోత్కూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భారీ వర్షాలు కురువకపోవడంతో యాదాద్రి భువనగిరి జిల్లాలో చెరువులు, కుంటలు నిండలేదు. బిక్కేరు వాగు కూడా పారలేదు. భీమలింగంకాల్వ సౌకర్యం ఉన్న పాలడుగు చెరువు కూడా ఈ ఏడాది నిండలేదు. దీంతో యాసంగి సీజన్‌కు బావులు, బోర్లలో భూగర్భ జలాలు తగ్గాయి. పూర్తిగా సాగు మానేస్తే పూట గడిచేదెట్లా అని రైతులు నీరు ఉన్నంతలో కొంత, కొంత సాగు చేసి వరి వేశారు. ముదురుతున్న ఎండలతో భూగర్భ జలాలు మరింత అడుగంటడం, వరి పొట్ట దశకు రా గా పంటకు నీరు ఎక్కువ అవసరం ఉండడం తో వేసిన పంటలోనూ కొంత ఎండిపోతోంది. జిల్లాలో ఇప్పటికే పది శాతం వరి పైరు ఎండిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా నెల రోజులు నీరు పారాలి. ఈ నెల రోజుల్లో ఇంకెంత ఎండుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో తగ్గిన వరి సాగు

గత ఏడాది యాసంగి సీజన్‌తో పోల్చితే ఈయాసంగి సీజన్‌లో జిల్లాలో వరి సాగు తగ్గింది.జిల్లాలో 17మండలాలు ఉండగా మోత్కూరు మండలంలో 269.10 ఎకరాలు, బీబీనగర్ మండలంలో 8.14 ఎకరాల సాగు పెరగ్గా మిగతా 15మండలాల్లోనూ తగ్గింది. జిల్లాలో గతయాసంగి సీజన్ కన్నా ఈ సీజన్‌లో 17,976.14ఎకరాల వరి సాగు తగ్గింది. మోత్కూరు బిక్కేరు వాగులో గత వానాకాలం సీజన్‌లో గోదావరి జలాలు పారించినందున ఈ యాసంగి సీజన్‌లోనూ ఆలేరు, తుంగతుర్తి ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, మందుల సామేలు బిక్కేరు వాగులోకి గోదావరిజలాలు విడుదల చేయిస్తారన్న నమ్మకంతో వాగు వెంట ఉన్న రైతులు వరి సాగు చేశారు. దీంతో మండలంలో స్వల్పంగా సాగు పెరిగింది. వారి ఆకాంక్ష మేరకు యాసంగిసీజన్‌లో ఎమ్మెల్యేలు బిక్కేరు వాగులోకి నీరు విడుదల చేయించారు. ఇప్పటికీ వాగులో గోదావరి జలాలు వస్తున్నాయి.

గొర్రెలు, పశువులకు మేతగా నోటికాడికొచ్చిన వరి

రైతులు వరి పంటకు ఎకరాకు సుమారు రూ.25వేలు పెట్టుబడికి ఖర్చు చేశారు. వరి ఇప్పుడు పొట్ట దశలో ఉంది. ఇంకో నెల రోజులు నీరు పారిస్తే పంట చేతికి వస్తుంది. ఇక పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతంలో, బిక్కేరు వాగుకు సమీపంలో ఉన్న వరి పంటలకు మాత్రం నీరు అందుతుండగా బావులు, బోర్ల కింద సాగు చేసిన వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. పెట్టుబడులన్నీ పెట్టాక పంట ఎండిపోతుండటంతో రైతులు ఖిన్నులవుతున్నారు. పశువులు, గొర్రెలు ఉన్న రైతులు నోటికాడికి వచ్చి ఎండిన వరిని వాటిని మేపుతున్నారు. ఎండిన వరి తమ వద్ద మేతకు కూడా ఎవరూ కొనడం లేదని పశువులు, గొర్రెలు లేని రైతులు వాపోతున్నారు.

మండలాల వారీగా వరి సాగు వివరాలు

మండలం	2023-24 యాసంగి	2024-25 యాసంగి	తగ్గిన సాగు	పెరిగిన సాగు
అడ్డగూడూరు	11,374.28	11,179	195.28	---
ఆలేరు	11,315.17	9,960	1,355.17	----
ఆత్మకూరు(ఎం)	19,711.19	18,120	1,591.19	----
గుండాల	14,295.36	12,250	2,045.36	----
మోత్కూరు	10,466.30	10,736	------	269.10
బి.పోచంపల్లి	28,656.05	28,600	56.05	-----
భువనగిరి	21,795.12	21,650	145.12	-----
బీబీనగర్	13,841.26	13,850	------	08.14
చౌటుప్పల్	14,724.20	12,781	1,943.20	-----
ఎస్.నారాయణపూర్	9,775.28	4,850	4,925.28	-----
రామన్నపేట	28,640.28	28,500	140.28	-----
వలిగొండ	40,801.34	39,200	1,601.34	----
బొమ్మలరామారం	9,880.13	9,530	350.13	----
మోటకొండూరు	13,544.32	11,970	1,574.32	----
రాజపేట	16,605.09	14,750	1,855.09	----
తుర్కపల్లి	15,480.24	15,480	00.24	----
యాదగిరిగుట్ట	12,381.13	11,910	471.13	----
మొత్తం	2,93,292.14	2,75,316	18,253.38	277.24

మూడు ఎకరాలు వరి వేస్తే సగం ఎండింది

నేను ప్రతి ఏడాది ఐదెకరాలు సాగు చేస్తాను. ఈ యాసంగిలో పంట చేతికి వచ్చే వరకు నీరు దొరుకుతుందో లేదోనని మూడు ఎకరాలు మాత్రమే వరి వేశాను. వరికి పెట్టుబడులన్నీ పెట్టాను. వరి పొట్ట దశకు వచ్చింది. ఎండలకు బావిలో భూగర్భ జలాలు అడగంటి వరికి నీరు అందక రోజుకింత ఎండిపోతున్నది. ఇప్పటికే ఎకరంన్నర ఎండిపోయింది. ఇంకా అర ఎకరం ఎండిపోయేలా ఉంది. ఎండిన వరికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

- నల్లపోగుల ఉపులయ్య, రైతు, పనకబండ

'కల్వకుంట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి'

మునుగోడు రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ నాయకులు కట్ట లింగస్వామి, మిర్యాల భరత్ కోరారు. శనివారం టీజీఆర్టీసీ నల్లగొండ ఆర్ఎం జానారెడ్డికి వినతిప్రతం అందజేశారు. విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న వేళ పరీక్షల సమయానికి అనుకూలంగా బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు, నాయకులు పగిళ్ల యాదయ్య, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కట్టంగూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మదర్ థెరిస్సా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ పొలిశెట్టి జూలియన్ అన్నారు. మండలంలోని పామనగుండ్ల గ్రామరైతు వేదికలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా తమ ప్రతిభను కనబరచాలని అన్నారు. పామనగుండ్ల పంచాయతీ కార్యదర్శి జయసుధ, నాగమణి, నవ్య, లుర్థురాజ్, కుశలవరెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చండూరులో పీడీఎస్ బియ్యం పట్టివేత

చండూరురూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం చండూరు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా నారాయణపురం మండలం వాచ్యతండాకు చెందిన వాంకుడోతు శ్రీధర్ అనే వ్యక్తి శనివారం మధ్యాహ్నం తన సొంత ఆటోలో అక్రమంగా 7 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు చండూరు మండలం కొండాపురం గ్రామశివారులో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

జీఎడవల్లిలో వైద్య శిబిరం

కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు

కనగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామంలో శనివారం నేలంటి కోటయ్య జ్ఞాపకార్థం హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో నేలంటి రవి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో సుమారు 2 వందల మందికి కంటి పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 45 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరం కాగా వారిని హైదరాబాద్‌కు తరలించారు.

నత్తనడకన ఫ్లైఓవర్ నిర్మాణం



- రెండేళ్లుగా కొనసాగుతున్న మర్రిగూడ బైపాస్ ఫ్లై ఓవర్ పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పెరుగుతున్న ప్రమాదాలు

రహదారుల వెంట ప్రమాదాలు జరగకుండా చూడటమే కాకుండా ప్రయాణాలు సాఫీగా జరిగేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇందు లో భాగంగా పట్టణంలోని మర్రిగూడ బైపాస్ పరిధిలో చేపట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై సుమారు రెండేళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడం లేదు. ఫలితంగా ట్రాఫిక్ కష్టాలతో పాటు నిత్య ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం నిర్మాణాలను పూర్తి చేయడంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండటౌన్)

జిల్లా కేంద్రంలోని చర్లపల్లి సమీపంలో ఉన్న మర్రిగూడ బైపాస్ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వాహనాల తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని బైపాస్‌పై వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా మర్రిగూడ బైపాస్ వద్ద రూ. 45కోట్ల అంచనా వ్యయంతో 2023 అక్టోబరు 2న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సుమారు అర కిలోమీటరు పైగానే ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పనులు ప్రారంభించారు. రెండేళ్ల గడుస్తున్నా ఫ్లైఓవర్ నిర్మాణంలో వేగం కనిపించడం లేదు. అధికారులు, కాంట్రాక్టర్లు సైతం నిర్మాణంలో అలసత్వం వహిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అయితే పనులు ప్రారంభమైన కొద్ది రోజులకు రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు రావడం ప్రభుత్వాలు మారడం వంటివి చకచకా జరిగిపోయాయి. అయితే నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఫ్లైఓవర్ నిర్మాణంలో చిన్న చిన్న మార్పులతో అంచనా వ్యయం కాస్తా రూ.65 కోట్లకు పెంచింది. అయినా పనులు పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఆ మార్గం గుండా వచ్చే వాహనదారులు నిత్యకష్టాలను అనుభవిస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయితే మర్రిగూడ బైపాస్ వద్ద వాహనాల రద్దీ తగ్గే అవకాశం ఉంది.



వాహనాలను దారి మళ్లించడంతో....

అద్దంకి బైపాస్ రోడ్డు ప్రధాన రహదారి కావడంతో అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కార్లతో పాటు భారీ వాహనాలు వస్తుంటాయి. మర్రిగూడ బైపాస్ వద్ద ట్రాఫిక్ డైవర్షన్ సూచికల లోపంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. మిర్యాలగూడ వైపు నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలు మర్రిగూడ సర్కిల్ నుంచి నల్లగొండ వైపు సుమారు 50 మీటర్లకు పైగా వచ్చి తిరిగి నార్కట్‌పల్లి వైపు మళ్లించి హైవే పైకి వెళ్లాల్సి వస్తుండటంతో హైదరాబాద్ నుంచి నల్లగొండ వైపు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై వాహనాలు వేగంగా వస్తుండటం ఒక్కసారిగా డైవర్షన్ రావడంతో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇదే తరహాలో ట్రావెల్స్ బస్సు కూడా బోల్తా కొట్టగా పలువురు క్షతగాత్రులయ్యారు. దీనికి తోడు మర్రిగూడ బైపాస్ నుంచి పిట్టంపల్లి, కట్టంగూరు రోడ్డుకు సైతం ఇదే ప్రాంతం గుండా దారి ఉండటం, ఈ బైపాస్ వద్దనే రెండు ఫంక్షన్ హాల్స్ ఉండటంతో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉండటం ప్రమాదాలకు కారణంగా తెలుస్తోంది.

ఫ్లై ఓవర్ నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి



ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని. ఈ పనులు ప్రారంభించిన దగ్గరి నుంచి ట్రాఫిక్‌కు చాలా ఇబ్బందిగా ఉంది. మర్రిగూడ బైపాస్ వద్దకు రాగానే మూడు వైపుల నుంచి వచ్చే వాహనాలన్నీ ఒక్కదగ్గరికీ రావడంతో రోడ్డు క్రాస్ చేయాలంటే ఇబ్బందిగా మారుతింది. వాహనాల వేగానికి బైపాస్ వద్ద విపరీతమైన దుమ్ము లేస్తోంది. ఇది కళ్లలో పడి రహదారి కూడా కనిపించడం లేదు. దీంతో వెనుక నుంచి వాహనాలతో ఇబ్బందులలు ఎదురవుతున్నాయి.

- పి. వెంకన్న, అన్నెపర్తి

విద్యుత్ లైన్ల కారణంగా పనులు నిలిచిపోయాయి

మర్రిగూడ బైపాస్‌లో నార్కట్‌పల్లి -అద్దంకి రహదారిలో చేపట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. విద్యుత్ లైన్ల నిర్మాణ పనులకు ఆటంకంగా మారడంతో కొన్ని రోజులుగా పనులు నిలిచిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు కూడా ప్రస్తుతం విద్యుత్ హెచ్‌టీ లైన్లకు క్లియరెన్స్ ఇచ్చారు. తిరిగి పనులను ప్రారంభించి ఈనెలాఖరులోగా పూర్తిచేస్తాం. ఇప్పటికే ప్రారంభంలో ఉన్న అంచనా వ్యయాన్ని కూడా మార్చి రూ. 65 కోట్లకు పెంచడం జరిగింది. ప్రస్తుతం నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదు. సకాలంలో పనులు పూర్తి చేసి ఫ్లై ఓవర్‌ను అందుబాటులోకి తీసుకవస్తాం.

- యాకూబ్, ఈఈ, ఆర్అండ్‌బీ



కనగల్ : రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా రథోత్సవం.. కల్యాణం

కనగల్, మునుగోడు రూరల్, శాలిగౌరారం, తిప్పర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లోని పలు శివాలయాల్లో శనివారం రథోత్సవాలు, కల్యాణాలు నిర్వహించారు.

● కనగల్ గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బండిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయం వద్ద శనివారం తెల్లవారుజామున అగ్నిగుండాలను ఏర్పాటు చేశారు. అనతరం రథోత్సవంలో భాగంగా అర్చకులు శంకరశర్మ, గిరిప్రసాద్, మంజునాథ ఆధ్వర్యంలో గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు మండలంలోని కొంపల్లి గ్రామంలో రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పార్వతీ రామలింగేశ్వర కల్యాణమహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెదిర విజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బూరుగు శ్రీను దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం చెరుకూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వెదిర పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిర మేగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెదిర విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాల వెంకన్నయాదవ్, అప్పారావు, శంభుగౌడ్, శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని బైరవునిబండలోని గంగా భవానీ సమేత శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో గత నెల 25న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఎడ్లబండ్ల గిరి ప్రదక్షిణతో ముగిశాయి. బైరవునిబండ, రామాంజపురం, బెండలపహాడ్, ఆవుసలోనిబావి గ్రామాల ప్రజలు ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శాలిగౌరారం మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగే నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు షేక్ ఇంతియాజ్‌అహ్మద్, ఆలయకమిటీ చైర్మన్ దండ యాదగిరిరెడ్డి, ఆలయ పూజారి వనం రమేష్, మాజీ వైస్ ఎంపీపీ దండ నర్సిరెడ్డి, అయితగోని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తి మండలంలోని పరిధిలోని రామలింగాలగూడెంలోని భక్త

● పలు ఆలయాల్లో ముగిసిన ఉత్సవాలు

మార్కండేయస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆలయ చైర్మన్ వనపర్తి శ్రీనివాస్ తెలిపారు.



మునుగోడు : కొంపల్లి గ్రామంలో రామలింగేశ్వర ఆలయంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మరబోయిన నాగార్జున

నల్లగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యేక బస్సు సౌకర్యాలు, పరీక్ష సెంటర్‌లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఎండతీవ్రత దృష్ట్యా మందులు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు చామకూరి లింగస్వామి, నోముల క్రాంతి యాదవ్, తిరుమల సైదులు, శంకర్, గణేష్, నరేష్, సురేష్, మహేష్ పాల్గొన్నారు.

కరెంట్ కష్టాల నుంచి రైతులను రక్షించాలి

నాంపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు నిరంతర విద్యుత్‌ను అందించి వారి కష్టాల నుంచి రక్షించాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ నక్క చంద్రశేఖర్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు లేవని వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇచ్చేదని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుం దో తెలియడం లేదన్నారు. కరెంట్ కోతలతో రైతులు, ప్రజలు, చిన్నచిన్న వ్యాపారస్తు లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంత రం కరెంట్‌ను అందించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బెల్లి సత్తయ్య, బీఆర్ఎస్ మండల నాయకులు బుడిగపాక గోవర్ధన్, గౌరు కిరణ్, గంజి సంజీవ, ఎదుళ్ల యాదగిరి పాల్గొన్నారు.

కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా ప్రవీణ్‌కుమార్

శాలిగౌరారం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా బోగరాజు ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన వెంకన్న కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.


పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ముత్యాలమ్మగూడెంలో వ్యవసాయ క్షేత్రం పరిశీలిస్తున్న విద్యార్థులు

కట్టంగూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుకుంట్ల విద్యాసాగర్ రెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫీల్డ్ ట్రిప్ ఎడ్యుకేషనల్ టూర్‌లో భాగంగా జేవీవీ, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని నోముల, నెల్లిబండ గ్రామాల్లోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులను శనివారం మండలంలోని ముత్యాలమ్మగూడెం, కట్టంగూరు గ్రామంలో విద్యా విజ్ఞానయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సన్‌బాత్ నిర్వహించి, సర్ఫెస్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్, డెయిరీ ఫామ్స్, సోలార్ కోల్డ్ స్టోరేజీ, ఎలక్ట్రిక్ రీచార్జ్ యూనిట్స్‌ను చూపించి అవగాహన కల్పించారు. వ్యవసాయంపై ఇష్టం కలిగేలా పిల్లలను ప్రోత్సహించాలని, పర్యావరణంపై జీవన అలవాట్లు పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నంద్యాల హరిందర్, సులోచన, జనవిజ్ఞాన జిల్లా కార్యదర్శులు గంగాధరి భద్రయ్య, కోకిల వంటిపాక నగేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో చామలపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

చండూరురూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): చండూరు మండల పరిధిలో చామలపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఇలా చేయడం వల్ల ప్రతీ రోజు ఉపాధ్యాయులు పడే బాధలు విద్యార్థులకు అర్థమవుతాయని హెచ్ఎం శ్రవణ్‌కుమార్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎంగా అంజలి, ఎంపీడీవోగా మేఘన, ఎంఈవోగా సిద్ధు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రవణ్‌కుమార్, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లి మండల కేంద్రంలో గల జిల్లా ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి స్నేహితులకు విద్యాబోధన చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం

● రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి

చిట్యాలరూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి విమర్శించారు. మండలంలోని వెలిమినేడులో శనివారం నిర్వహించిన రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పంటలను సాగుచేసేందుకు రైతులు ఎంతో కష్టపడతారని వాటిని విక్రయించేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందని అన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు తీరని నష్టం కలుగుతుందన్నారు. రైతుల సమస్యలపై రైతుసంఘం రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి శ్రీను, నాయకులు నెలికంటి నర్సింహ, పంది నరేష్, అరూరి శంభయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి, యాదిరెడ్డి, లింగారెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.




సభ్యత్వ నమోదులో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి

స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలి

● స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి

రామగిరి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్వర్ణకారులు ఎదుర్కొంటు న్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంజమూరి రాఘవాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని వి శ్వబ్రాహ్మణ వసతిగృహంలో శనివారం జరిగిన సంఘం జిల్లా కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, ప్రధాన కార్యదర్శి ఇనుగుర్తి గోపి, కోశాధికారిగా కటకం రమేష్‌చారి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వర్ణకారులందరూ ఐక్యంగా ఉంటేనే సంఘాలకు గౌరవం ఉంటుందని సూచించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు గిరి మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఇటీవల కాలంలో అక్రమ రికవరీల పేరిట పోలీస్ వేధింపుల సమస్యను స్వర్ణకారులు తీవ్రంగా ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను మంత్రి వెంకట్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కోర్టు పరిధిలోని మడిగల సమస్య కూడా అతి త్వరలో పరిష్కారం కానందున్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాట్లాడుతూ పోలీసులకు అవకాశం ఇవ్వకుండా, దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని తగు జాగ్రత్తలు వహిస్తూ వ్యాపారాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి ర మేష్, స్వర్ణకార సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణాచారి, సంఘం నాయకులు కన్నెకంటి సత్యం, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నభీమోజు నాగార్జున చారి, సంఘం నాయకులు కొల్లూరు సత్యనారాయణ చారి, కూరెళ్ల మదనాచారి, గొట్టుముక్కల చంద్రశేఖర్, విష్ణుమూర్తి, కృష్ణకుమార్, చంద్రశేఖర్, భీష్మాచారి, విఠలాచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవాచారి

అమరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ

చిట్యాల, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగల త్యాగానికి ఫలితం దక్కుతుందని, త్వరలోనే ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ అన్నారు. చిట్యాలలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు శనివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల ఆశయాలను సాధిస్తామని అన్నారు. రాజకీయాలకతీతంగా వర్గీకరణకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు నోముల పురుషోత్తం, జిట్ట రవి, ఏర్పుల సైదులు, మేడి కృష్ణ, కావలి కృష్ణ, వడ్డేపల్లి బిక్షం, జోగు ప్రవీణ్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలకేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30ఏళ్లుగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే వర్గీకరణ కోసం మాదిగలు గాంధీభవన్ ఎదుట బలిదానం చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కారుపాటి అంబేడ్కర్ మాదిగ, సైదులు, బట్ట శ్రీను, వెంకటయ్య, గద్దపాటి అరవింద్, నాగరాజు, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.

ఆడపిల్లల పెళ్లిళ్లకు కంచర్ల బ్రదర్స్ కానుక



ఉరుమడ్లలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మాజీసర్పంచ్ యాదిగిరిగౌడ్

చిట్యాలరూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలం ఉరుమడ్ల గ్రామంలో ఆడపిల్ల పెళ్లిళ్లకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కృష్ణారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో పెళ్లిళ్ల చేసుకున్న పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు రూ.1.30 లక్షలు పెళ్లి కానుకను అందజేశారు కంచర్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి. గ్రామానికి చెందిన కమ్మలపల్లి సునీతకు రూ.30వేలు, వేముల నీలమ్మ రూ.50వేలు, పాలకూరి నీలమ్మ రూ.50వేలు మొత్తం రూ.1.30 లక్షలను అందజేశారు. వారికి గ్రామమాజీ సర్పంచులు సుంకరి యాదగిరిగౌడ్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఉ య్యాల నాగరాజుగౌడ్ అందజేశారు. ఇదివరకు పెళ్లికానుక రూ.30వేలు అందజేస్తుండగా ఇటీవలే దాన్ని రూ.50వేలకు పెంచారు. గ్రామంలోని ఆడపిల్లల పెళ్లిళ్లకు కానుకనివ్వడం ఎంతో అభినందనీయమని వారు పేర్కొన్నారు. కంచర్ల బ్రదర్స్‌కు మూడు కుటుంబాలకు చెందిన వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సుంకరబోయిన నర్సింహ, నర్సింహయాదవ్, చిననర్సింహ, బషీరుద్దీన్, సత్యనారాయణ, భిక్షం, గంగరాజు, భాస్కర్, లింగస్వామి, నరాల రామకృష్ణ, రామకృష్ణ, నాగరాజు, భద్రయ్య, వెం కన్న, యాదయ్య, రాములు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

● ఎమ్మెల్యే కోమటిరెడ్డిని కలిసిన మహ్మదాపురం గ్రామస్థులు

నాంపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలో పెనివాలద్రిసిత స్వామి 100వ బ్రహ్మోత్సవాలు ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని గ్రామస్థులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వాన పత్రికను అందజేశారు. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆయనకు తెలిపారు. గ్రామానికి అధిక నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మలిగిరెడ్డి చంద్రారెడ్డి, దేవాలయ చైర్మన్ పున్నారెడ్డి, దిలీప్‌రెడ్డి, అర్చకులు వింజమూరి రంగాచార్యులు, రాశిక శ్రీరాములు, మారపాకుల యాదయ్య, కేశమల్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 | కనిష్ఠం 20.0



● బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ఏకశిఖర వాసుడు లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేనారాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, వేద మంత్రోచ్ఛారణ, చతుర్వేద, ప్రబంధ పారాయణాల నడుమ సంప్రోక్షణ, పుణ్యాహవాచనం, మృత్స్యంగ్రహణం, అంకురార్పణ కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు.



●6లో..



● చాంద్ ముబారక్

నెలవంక కనిపించడంతో జిల్లాలో రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగను అధికారికంగా నిర్వహించనుండటంతో ప్రత్యేక ప్రార్థనలకు మసీదుల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మసీదుల్లో సైరన్ మోగించి మాసం ప్రారంభమైనట్టు ప్రకటించారు. ఈ మాసంలో ఇఫ్తార్ విందుల సందడి నెలకొననుంది. రంజాన్ మాసం ప్రత్యేక వంటకం హలీమ్ కాగా, ఇది చికెన్‌తో రూపొందనుండటంతో బర్డ్‌ఫ్లూ భయంతో విక్రయాలపై ప్రభావంపడే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. రంజాన్ మాసం ప్రారంభం అవడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

● ఆంధ్రజ్యోతి, నల్లగొండ కల్చరల్

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఈ నెల 5 నుంచి 25 తేదీ వరకు పరీక్షలు
- ఈసారి కూడా నిమిషం నిబంధన అమలు
- గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- ఉమ్మడి జిల్లాలో 113 పరీక్షా కేంద్రాలు, 58,222మంది విద్యార్థులు



నల్లగొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్‌ల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఇన్విజిలేటర్సను నియమించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 113 కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి చెందిన 58,222మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. గంట ముందు నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించనున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు తెలిపారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా తాగు నీటి సౌకర్యాన్ని కల్పించనున్నారు. వేసవి దృష్ట్యా ఎవరైనా...

- మిగతా 7వ పేజీలో...

జిల్లా	పరీక్షా కేంద్రాలు	ఫస్టియర్ విద్యార్థులు	సెకండియర్ విద్యార్థులు	మొత్తం
నల్లగొండ	52	13,992	14,730	28,722
సూర్యాపేట	32	8,640	8,308	16,948
యాదాద్రి	29	6,252	6,300	12,552
మొత్తం	113	28,884	29,338	58,222



మండలి పోలింగ్ సరళిపై అభ్యర్థులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు సమీక్షల్లో బిజీబిజీగా ఉన్నారు. ఎవరికి వారు కూడికలు, తీసివేతల లెక్కల్లో మునిగితేలుతున్నారు. ఓటరు నాడి అంతు చిక్కకపోవడంతో గెలుస్తామో లేదో అనే ఆందోళన అభ్యర్థుల్లో మొదలైంది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌లో ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు హోరాహోరీగా పోటీపడ్డారు. దీంతో ఈ ఎన్నిక ఫలితం ఎలా ఉండనుందోనని ఆసక్తి అంతటా ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లు ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపారోనని ప్రధాన సంఘాల నేతలు అంచనాల్లో మునిగారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

మండలి.. ఎన్నికలో గట్టెక్కుతామా?

- ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారనే అంశంపై నేతల్లో అలజడి
- ఓటరు జాబితాలతో కసరత్తు చేస్తున్న సంఘాలు
- ఏ జిల్లాలో ఎవరికి అధిక ఓట్లు పడ్డాయని అంచనాలు
- ఈ నెల 3న రాత్రి తరువాతే ఉత్కంఠకు తెర

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలే ఎజెండాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు, వారిని బలపరుస్తున్న ఉపాధ్యాయ, బీసీ సంఘాల నేతలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తమను గెలిపిస్తే ప్రభుత్వం ద్వారా సరైన న్యాయం చేయిస్తామని హామీలు ఇచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపాలనే నినాదంతో పలు సంఘాలకు చెందిన నేతలు ఎన్నికల బరిలో నిలిచారు. చివరికి ఎన్నిక ప్రశాంతంగా ముగియగా, భారీగా పోలింగ్ శాతం నమోదైంది. ఈ నెల 3న మండలి ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. భారీగా పోలింగ్ నమోదు కావడంతో ఓటరునాడి తెలియక అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతల్లో ఫలితాలపై ఉత్కంఠ ఏర్పడింది. ఓటరు జాబితాలు తీసుకొని ఏ జిల్లాలో తమ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడే అవకాశం ఉందనే అవకాశాలపై ముఖ్యనేతలు మూడు రోజులుగా కూడికలు, తీసివేతల్లో బిజీగా ఉన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి నేతల నుంచి రాష్ట్ర కమిటీ నేతలు సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాల కార్యాలయాల్లో కీలక నేతలు సమావేశమై ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారని, ఈ ఎన్నికలో గట్టెక్కుతామా? అంటూ ఆరా తీస్తూ అంచనాలు తారుమారవుతాయా? అనే అలజడి ఆశలు పెంచుకున్న అభ్యర్థులు,నేతల్లో మొదలైంది. ఉపాధ్యాయ మండలి నియోజకవర్గంలో మొత్తం 12 జిల్లాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 8,331 మంది ఓటర్లు ఉండగా, నల్లగొండ జిల్లాలో 4,683 మంది, యాదాద్రి జిల్లాలో 984 మంది, సూర్యాపేట జిల్లాలో 2,684 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచి ఉన్నారు. గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నా, వాస్తవ పరిస్థితి ఏంటనే అంశంపై క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఏ అభ్యర్థికి అధికశాతం మద్దతు లభించిందనే....

- మిగతా 6వ పేజీలో...

ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సవ్యంగా నిర్వహించేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎమ్మెల్సీ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ఏర్పాటు చేయనున్న టేబుళ్లు, చెల్లుబాటు అయ్యే ఓట్లు, కాని ఓట్ల గుర్తింపు, తదితర అంశాలను ఆమె వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకుడి సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని, ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు సహకారం అందించాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాలబావి స్టేట్ వేర్ హౌసింగ్ గోదాములో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు అధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు నియమించిన సిబ్బంది కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫాం-16ను సరిపోల్చుకోవడం, బ్యాలెట్ బాక్సుల సీలును అభ్యర్థులు, ఏజెంట్ల ఎదుట తీయడం, సంబంధిత ఫారాల్లో సంతకం చేయడం వంటి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెల్లని ఓట్ల విషయంలో సందేహాలు వస్తే ఏఆర్‌వో లేదా రిటర్నింగ్ ఆఫీసర్ టేబుల్ వద్ద నివృత్తి చేసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్య ఓటు విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జ్ డీఆర్వో అశోక్‌రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నల్లగొండ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సోషలిజమే మార్గమని, పెట్టుబడిదారీ విధానానికి విసిగిన ప్రపంచం కమ్యూనిజం వైపు చూస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానంతో పలు సంక్షోభాలు ఏర్పడి సమానత్వం కోసం పోరాడే ప్రజలు కమ్యూనిజం వైపు చూస్తున్నారని అన్నారు. రానున్న కాలంలో కమ్యూనిజానికి మంచి రోజులు వస్తాయన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అమెరికాలో నూతనంగా ఏర్పడిన ట్రంప్ ప్రభుత్వం మన వారిని గెంటివేస్తుంటే ప్రధాని నరేంద్రమోదీ వారితో సాన్నిహిత్య సంబంధాలు ఏర్పాటు చేసుకుంటున్నామని చెప్పడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. శ్రీలంకలో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేసి కమ్యూనిస్టుల పాలనను కోరుకున్నారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు లేకపోవడంతో గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా సీపీఎం అభ్యర్థులు పోటీ చేస్తారని, వారి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో సర్వేలు నిర్వహించి ప్రజా సమస్యలపై కరపత్రాలు ముద్రించి పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళనలను నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, డబ్బీకార్ మల్లేష్, పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో 'పది'లం

●7లో..

చదువుతో ఏదైనా సాధించవచ్చు

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఇంటి పనులు చేస్తూ టైలరింగ్ నేర్చుకోవడం అభినందనీయమన్నారు. మహిళలు బాగా చదువుకుంటే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, వయసుతో చదువుకు సంబంధం లేదన్నారు. 50ఏళ్ల తరువాత కూడా మహిళలు చదువుకొని పెద్ద కంపెనీలు ప్రారంభించి సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు చాలా మంది ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తాను సైతం తెలంగాణ ఉద్యమంపై అవగాహన కోసం చాలా పుస్తకాలు చదివానని తెలిపారు.అయితే ఈ కేంద్రంలో సరిపడా కుట్టు మిషన్లు లేవని మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, 30కుట్టు మిషన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివి పేరు తీసుకురావాలి

విద్యార్థులు కష్టపడి చదివి సమాజానికి, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం సమీపంలోని బాలికల రెసిడెన్షియల్ కళాశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినులు పరిజ్ఞానాన్ని సంపాదించేందుకు పుస్తకాలు, వార్తా పత్రికలు బాగా చదవాలని, ప్రత్యేకించి సంపాదకీయాలు, గొప్ప వ్యక్తుల పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం కళాశాల వంటగది, డైనింగ్, పరిసరాలను పరిశీలించి వంటగదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. అపరిశుభ్రత కారణంగా ఏ ఒక్క విద్యార్థిని ఆస్పత్రిపాలు కాకుండా చూడాలని, బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ వాడవద్దని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కాగా హాస్టల్‌కు గ్యాస్ స్టవ్‌లు కావాలని ప్రిన్సిపాల్ కోరగా, అందుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ షాహిన్ షేక్, తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

(ఆంధ్రజ్యోతి, మాడ్గులపల్లి): అధికారులు మండలాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాన్ని, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ స్థలం ఉన్నందున ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి భూమి కేటాయించినట్టు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబీవీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో స్వామి, ఉన్నారు.

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌పై కలెక్టర్ ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి, తిప్పర్తి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను కలెక్టర్ శనివారం రాత్రి తనిఖీ చేసి ఆ సమయంలో అందుబాటులో లేని స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేజీబీవీలోని వంట గది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. భోజనం, మెనూ వివరాలను విద్యార్థినులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



హాస్టల్‌లో భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు

మిర్యాలగూడ టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ భవనాల్లో మెనూ తప్పకుండా పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని కళాశాల బాలుర వసతి గృహంలో ఆయన శుక్రవారం రాత్రి బసచేసి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. శనివారం ఉదయం వసతి గృహ అధికారులతో మాట్లాడుతూ, విద్యార్థులకు అందుతున్న వసతులు, ఆహారాన్ని పరిశీలించానని, మెనూ తప్పకుండా పాటించాలని సూచించారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు స్టడీ అవర్ కేటాయించాలని, విద్యతో పాటు జీవన పాఠాలు నేర్పించాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూవో వెంకటకృష్ణ, వార్డెన్ అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాస్

నల్లగొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార, మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. డీసీఎంఎస్‌ల పాలకవర్గ కాల పరిమితి గత నెల 25న ముగిసింది. దీంతో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జ్‌గా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర సహకార, రిజిస్ట్రేషన్ కోఆపరేటివ్ సొసైటీల కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు తీసుకోగా, జిల్లా సహకారశాఖ అధికారి పత్యా నాయక్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నేటికీ అందని రాజ్యాంగ హక్కులు

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

నల్లగొండ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నేటికీ రాజ్యాంగ హక్కులు దళితులకు చేరడం లేదని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మగ్దుమ్ భవన్‌లో నిర్వహించిన డీహెచ్‌పీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ప్రతీ మనిషికి ఓటు హక్కు కల్పించడం మహత్తరమైనదని, న్యాయకల్పనలో ప్రభుత్వాల కృషి లోపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన బడ్జెట్‌లో కేవలం 5 శాతం మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళితులు చేస్తున్న పోరాటంలో డీహెచ్‌పీఎస్ భాగస్వామం కావాలన్నారు. అట్టడుగు వర్గాలకు ద్రోహం చేసే విధంగా బీజేపీ విధానాలు ఉన్నాయని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు నేటితరం సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లగిరి నరసింహ, వెంకటయ్య, సత్యం, వెంకన్న, గోస్కుకొండ లింగయ్య పాల్గొన్నారు.

పట్టణంలో కొనసాగుతున్న నక్షా సర్వే



పట్టణంలోని సాగర్ రోడ్డులో సర్వే చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి) పట్టణంలో నక్షా సర్వే కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్ట్ నక్షాలో భాగంగా సర్వేలో సర్వే ఆఫ్ ఇండియా సర్వేయర్లు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ మాట్లాడుతూ నక్షాతో మునిసిపాలిటీలలోని గృహాలు, ఆస్తులు, భవనాల గుర్తింపుతో పాటు ఖచ్చిత కొలతలతో మ్యాప్ రూపకల్పన జరుగుతుందన్నారు. ప్రైవేట్ ఏజెన్సీ సేకరించిన కొలతలను సర్వే ఆఫ్ ఇండియా అధికారులు రీ సర్వే చేస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నక్షాకు పది పట్టణాలు ఎంపిక కాగా అందులో మిర్యాలగూడ ఉండటం గొప్ప విషయమన్నారు. ఆయన వెంట ఎస్‌వోఐ సర్వేయర్ ఎం.రంగస్వామి, గోపిటర్, సైదులు ఉన్నారు.

కమలాపూర్‌లో వైభవంగా రథోత్సవం

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్, ఆలయకమిటీ నిర్వాహకులు

దేవరకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం కమలాపూర్ భద్రకాళిసమేత వీరభద్రస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నిర్వహించిన రథోత్సవంలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఆలయకమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొని వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కోరిన కోర్కెలు నెరవేర్చే దైవంగా వీరభద్రస్వామి దేవాలయానికి పేరుందని దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయకమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రథోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు మార్చాల శ్రీనివాస్‌శర్మ, పణేంద్రశర్మ, లక్ష్మీనారాయణ, దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు టీవీఎన్ రెడ్డి, ముదిగొండ సత్యం, నరియానాయక్, శంకర్‌నాయక్, మాజీ ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిరుపేద టైలర్లను ఆదుకోవాలి



టైలర్లను సన్మానిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ

దేవరకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నిరుపేదలైన టైలర్లకు ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఎన్‌వీటీ అన్నారు. టైలర్స్ డేను పురస్కరించుకొని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు టైలర్లను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌వీటీ మాట్లాడుతూ రెడీమేడ్ దుస్తులు వస్తుండటంతో టైలర్లు ఉపాధి కోల్పోతున్నారని, వారికి అండగా నిలవాలని అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని టైలర్లందరినీ శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, తాళ్ల సురేష్, వర్కాల యాదమ్మ, మంగమ్మ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

● ఎమ్మెల్యే బాలునాయక్



చిన్నారుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నక్కలగండి చెరువులో నీట మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందడం బాధకరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండలం నక్కలగండి తండాలో మృతి చెందిన బాధిత కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మృతి చెందిన కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్యానాయక్, నాయకులు కిన్నెర హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాం, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న మార్కెట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా, మార్చి 1(ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీలతో వ్యక్తులు, గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పేరూరు గ్రామంలో నిర్వహించిన కబడ్డీ, కోలాటం, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులను ప్రదానం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, ఆలయ చైర్మన్ రిక్కల కొండారెడ్డి, సీఐ ఆంజనేయులు, నాయకులు చిట్టిపోలు యాదగిరి, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, కాంసాని చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, శోభన్‌బాబు, రాజు, రాంబాబు, ఆలయ ధర్మకర్తలు శ్రీనయ్య, పెద్ద నర్సింహ, సునీత, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దామరచర్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంఘం మండల కార్యదర్శి వీరన్ననాయక్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో టాలెంట్ టెస్ట్ కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడుతాయన్నారు. వార్షిక పరీక్షలను విద్యార్థులు భయాందోళనలు, ఒత్తిడి లేకుండా రాయాలన్నారు. కార్యక్రమంలో భార్గవ్, సురేష్, మణికంఠ, కార్తీక్, మౌనిక, అశ్విని, అఖిల పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొండమల్లేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు పస్నూరి యుగంధర్‌రెడ్డి తెలిపారు. కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం పక్కన ఉన్న పశువైద్యశాలలో హైదరాబాద్ మలక్‌పేట్ యశోద ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ల రాకతో రిక్షాలు మూలకు



నిరుపయోగంగా మారడంతో తుప్పు పట్టిన చెత్త సేకరణ రిక్షాలు

» నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు
» పట్టించుకోని అధికారులు

వేములపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలను పంపిణీ చేసింది. వాటిని సరైన విధంగా వినియోగించకపోవడంతో స్వచ్ఛభారత్- స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగమైన చెత్త సేకరణ రిక్షాలు నేడు తుప్పు పట్టిపోతున్నాయి. గ్రామాల్లోని జనాభా ప్రాతిపదికన గ్రామపంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చెత్త సేకరణ రిక్షాలను అందజేశారు. వాటిని వినియోగించడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలానికి 2017 అక్టోబరులో గ్రామజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు జనాభా ప్రాతిపదికన ప్రతీ వెయ్యి మంది జనాభాకు ఒక రిక్షా చొప్పున వేములపల్లికి-5, ఆమనగల్లు-5, శెట్టిపాలెం గ్రామపంచాయతీ-4, మొల్కపట్నం, సల్కునూరు గ్రామాలకు మూడు చొప్పున, రావులపెంట-2, తిమ్మారెడ్డిగూడెం, కామేపల్లి, అన్నపరెడ్డిగూడెం గ్రామాలకు ఒకటి చొప్పున మొత్తం 25 రిక్షాలను అందచేశారు. కానీ కొద్ది రోజులు వాటిని వినియోగించిన గ్రామ పాలకవర్గాలు అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్‌ను మంజూరు చేయడంతో వాటి నిర్వహణపై శ్రద్ధ చూపలేదు. దీంతో గ్రామాల్లో రిక్షాలు నిరుపయోగంగా ఉన్నాయి. ట్రాక్టర్లతో చెత్త సేకరణ భారంతో కూడుకొని ఉన్నా సిబ్బందికి ట్రాక్టర్‌తో చెత్త సేకరణ సులభతరం కావడంతో రిక్షాల ద్వారా గ్రామాల్లో పర్యటించి చెత్తను సేకరించడం నిలిపివేశారు. దీంతో రిక్షాలు ఎండకు ఎండి వానకు తడిసి ఏమాత్రం పనికిరాకుండా పోతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ లక్ష్యం నీరుగారడమే కాకుండా వేలల్లో ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువస్తే పారిశుద్ధ్య నిర్వహణలో కొంతమేర భారమైన తగ్గుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తాం

చెత్తసేకరణ రిక్షాల మరమ్మతుల విషయమై తమ దృష్టికి రాలేదు. వాటి స్థానంలో ట్రాక్టర్లు మంజూరవడంతో వేగవంతంగా చెత్త సేకరణకు ట్రాక్టర్లను వినియోగిస్తున్నాం. దీంతో గ్రామపంచాయతీలోని ట్రాక్టర్లు నిరూపయోగంగా ఉండటంతో మరమ్మతులకు గురయ్యాయి. పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లి వాటికి అవసరమైన మరమ్మతులు చేసి గ్రామాల్లో చెత్త సేకరణకు వినియోగిస్తాం.

- శారదాదేవి ఎంపీడీవో, వేములపల్లి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

శ్రీదేవి, వైద్యాధికారి, చింతపల్లి



వేసవికాలం సమీపస్తుండటంతో గ్రామాల్లోని ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు మంచినీటిని తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు వడదెబ్బ తగలకుండా అవగాహన కల్పించాలని సూచించారు.

- చింతపల్లి, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి: వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

వైద్యాధికారి: వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల ప్రజలు నీరు ఎక్కువగా తాగాలి. ఉపాధి హామీ వంటి పనుల్లో ఉండే కూలీలు ఉదయం, సాయంత్రం సమయంలో పనులు చేసుకుంటే బాగుంటుంది. మజ్జిగ, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తీసుకోవాలి. మధ్యాహ్నం సమయంలో ఎండలో తిరగకుండా ఉండాలి.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో కుక్కకాటు వ్యాక్సిన్లు ఉన్నాయా?

వైద్యాధికారి: ఆసుపత్రిలో కుక్కకాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కోతులు కరిచినా అవే వ్యాక్సిన్లను వాడుతున్నాం.ఇటీవల గ్రామాల్లో కుక్కలతో పాటు కోతులు కరిచిన కేసులు ఎక్కువగా వస్తున్నాయి.వాటి నియంత్రణకు పంచాయతీ వారు చర్యలు తీసుకుంటే కేసులు తగ్గే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?

వైద్యాధికారి: వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడకు చేర్చాలి. తడిగుడ్డతో శరీరంపై తుడవాలి. కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలి.అనంతరం ఆస్పత్రికి తరలించాలి.

ఆంధ్రజ్యోతి: ఆసుపత్రిలో ప్రసవాలు తక్కువగా ఉంటున్నాయి? వాటిని పెంచే ప్రయత్నం చేస్తున్నారా?

వైద్యాధికారి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతంతో కంటే ఇప్పుడు వసతులు పెరిగాయి. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలి. ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ద్వారా కృషి ప్రచారం మరింత స్థాయిలో నిర్వహిస్తున్నాం.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

● పలు పాఠశాలల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నిడమనూరు, దామరచర్ల, పెద్దవూర, పెద్దఅడిశర్లపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లోని పాఠశాలల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. పిల్లలకు పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



దామరచర్ల : కొండ్రపోలులో స్వపరిపాలన దినోత్సవం

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశ నిర్మాతలని, విద్యార్థులు కష్టపడి చదవి తల్లిదండ్రులకు, ఊరికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

● నిడమనూరు మండలంలోని ఊట్కూరు జడ్పీ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీధర్, కంచి సైదులు, సుదర్శన్, గీతారాణి, శ్రీవల్లి, సంధ్య, అర్షియా, సరిత, గిరిబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.సైదిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పెద్దవూర మండలంలోని పోతునూరు ప్రాథమికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.వెంకట్రామ్‌నాయక్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, మెహజాబి, గులాంఅజాద్, అంజూమ్‌మీరా, ధర్మారెడ్డి, అనిత, సైదమ్మ, మల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, బిల్ కలెక్టర్ మదన్ పాల్గొన్నారు.



పీఏపల్లి: విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాఠశాల సిబ్బంది

● గుడిపల్లి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



వార్షికోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ ముందుకుపోతుందన్నారు. ఇందులో భాగంగానే ప్రతీ నియోజకవర్గంలో సమీకృత గురుకులాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల మెనూలో పూర్తి మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, నాయకులు పుట్టల కృపయ్య, రేగట్టె రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీణ సుజాత, ఉపాధ్యాయులు ప్రసాద్, అంజయ్య, ఉపేందర్, జానకిరాములు, మల్లేష్, పురుషోత్తం, కోటేష్, రాజేష్, మీనాక్షి, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

● దేవరకొండలో ప్రమాదకరంగా డ్రైనేజీ గుంతలు

● పట్టించుకోని హైవే, మునిసిపల్ అధికారులు

దేవరకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో నేషనల్ హైవే ఆధ్వర్యంలో నిర్మించిన డ్రైనేజీలు గుంతలమయంగా ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని ప్రధాన కూడలి విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులోని మలుపు వద్ద డ్రైనేజీ గుంత ప్రమాదకరంగా మారింది. వారం రోజుల క్రితం గుర్తు తెలియ ని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తూ తట్టు తగిలి కిందపడి గాయపడ్డాడు. ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడితే పె నుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొం టున్నారు. నేషనల్ హైవే అధికారులు డ్రైనేజీల నిర్మాణంలో భాగంగా కొన్ని చోట్ల గుంతలను వదిలేశారు. గుంతలు ఉన్న చోట కవరు కానీ, స్లాబ్ కానీ వేయాలి. కాని రోడ్డు పక్కనే నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో పెద్ద డ్రై నేజీ గుంత ఏర్పడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై నేషనల్ హైవే ఏఈ కరుణాకర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా విషయం తమ దృష్టికి రాలేదని కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.





రహదారిపై ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ గుంత

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి



నిడమనూరులో మాదిగ అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నిడమనూరు, కొండమల్లేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పోరాటంలో ఎంతో మంది మాదిగలు ప్రాణత్యాగం చేశారని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కులాల వర్గీకరణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన వారి త్యాగాలను స్మరించుకున్నారు.

నిడమనూరులో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు బొజ్జ చిన్నామాదిగ, గన్నెపాక లక్ష్మణ్, పోలే రవి, కేవీటీ, బొజ్జ పుల్లయ్య, మోసాల శ్రీను, బొజ్జ ఏసు, కరుణాకర్, చిత్రం మల్లయ్య, భాస్కర్, రావులపాటి శ్రీను, నాగయ్య పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిరాల రమేష్‌మాదిగ, సాలయ్య, వన్కుల లక్ష్మణ్, అందుగుల శ్రీనుమాదిగ, యాదన్న పాల్గొన్నారు.

మద్దతు ధర చట్టం అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

వేములపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర చట్టం అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మోసపూరిత ఆలోచనలతో రద్దు చేసిన మూడు నల్లచట్టాలను మరో రూపంలో అమలు చేసేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. కేంద్రం తీసుకొచ్చిన చట్టాలతో వ్యవసాయరంగం నిర్వీర్యమై రైతులు మరింత నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం పెట్టుబడిదారి, పారిశ్రామిక, కార్పొరేట్ భాగస్వామ్య వర్గాలకు లబ్ధి చేకూర్చాలనే విధానాలను అవలంబిస్తూ రైతులపై వివక్ష చూపుతోందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు మల్లు గౌతంరెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, ప్రణీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ మహాసభను విజయవంతం చేయాలి

దేవరకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 9వ తేదీన నిర్వహించే అఖిలభారత పద్మశాలీ మహాసభను విజయవంతం చేయాలని పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసులు కోరారు. దేవరకొండలో శనివారం నిర్వహించిన సమావేశంలో మహాసభ పోస్టర్‌ను, కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. అంతకుముందు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు పగిడిమర్రి నాగరాజు, గాజుల వినయ్‌కుమార్, శిరందాసు కృష్ణయ్య, యేలే యాదయ్య, అంకం చంద్రమౌళి, జల్దా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలు వేలం

వేములపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమనగల్లు గ్రామంలోని శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములను ఎండోమెంట్ ఆఫీసర్ మృత్యుంజయశాస్త్రి ఆధ్వర్యంలో శనివారం కౌలు వేలం నిర్వహించారు. సుమారు 31ఎకరాల దేవాలయ భూమి వేలం నిర్వహించగా సర్వే నెం.48లోని 5.20 ఎకరాల భూమి ముండ్ల కల్యాణ్ రూ.1.71లక్షలకు, సర్వే నెం.776/1లోని 7 ఎకరాలు ముండ్ల శివ రూ.55వేలు, సర్వే నెం.766/2లోని 4 ఎకరాలు వల్లంపట్ల వెంకటేశం రూ.70వేలు, సర్వే నెం.300లోని రూ.2.20 ఎకరాలు నార్ల అజయ్ రూ.33వేలు, సర్వే నెం.290లోని 1.20ఎకరాలు కోల సైదులు రూ.20వేలు, సర్వే నెం.289లోని 1.31 ఎకరాలు పెరుమాళ్ల అమృతయ్య రూ.41వేలు, సర్వే నెం.49లోని 15.22 ఎకరాల భూమిని దేవాలయం కమిటీ సభ్యులు రూ.1లక్షకు వేలంలో దక్కించుకున్నారని ఎండోమెంట్ ఆఫీసర్ తెలిపారు. అదేవిధంగా కొబ్బరికాయల వేలం నిర్వహించగా నార్ల అజయ్ రూ.50 వేలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు.

సైన్స్‌తో ముడిపడిన జీవనం

మిర్యాలగూడ టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సైన్స్‌తో మానవ జీవనం ముడిపడి ఉందని ఎంఈవో లావుడి బాలు అన్నారు. పట్టణంలోని గాంధీపార్కు పాఠశాలలో నిర్వహించిన సైన్స్ డేకు ఆయన హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యశాస్త్రంపై పట్టు సాధిస్తే భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందన్నారు. మానవ జీవితంతో పాటు ప్రకృతితో మమేకమైన సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థుల్లో సృజన్మాతకతను పెంచుతూ ప్రయోగాలను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కురువా, ఉపాధ్యాయులు నిర్మల, పార్వతి, ఎలీషా, సలీమా, ప్రవీణ్, రాంరెడ్డి, వెంకటరమణాచారి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.